



ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని పరిచయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ఓట్లు అడుగుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సమావేశానికి హాజరైన ప్రజలు

ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- తుమ్మిడిహెట్టి అనుమతులు తెచ్చి ఉంటే 1.5లక్షల ఎకరాలకు నీరందేది
- బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందంతో కాంగ్రెస్‌ను ఓడించే కుట్ర
- అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపిస్తే యూనివర్సిటీ వచ్చే అవకాశం
- మంచిర్యాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, పక్కన డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

మంచిర్యాల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి బీజేపీఏం చేసిందని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులు ఓట్లడుగుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమ వారం జిల్లా కేం ద్రంలోని కలెక్టరేట్ సమీపంలో డీసీసీ ప్రెసిడెంట్ కొక్కిరాల సురేఖ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలనే కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కార్ ఈ రేస్ కేసులో కేటీఆర్ జైలుకు వెళ్లడం తప్పదనే ఉద్దేశంతో ఢిల్లీకి వెళ్లి రాయబారం నడిపారని, అక్కడ జరిగిన ఒప్పందంలో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు బరిలో నిలువలేదన్నారు. హరీష్ రావు, కేటీఆర్‌లు ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్‌ను ఓడించాలని చెప్తున్నారని, అసలు బీఆర్‌ఎస్ వాళ్లు ఎవరిని గెలిపించబో తున్నారని రేవంత్ ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్‌ను ఓడించాలని చెప్పడం వెనుక ఉన్న మతలబు ఏమిటో పట్టభద్రులు గమనించాలని కోరారు. బీజేపీ వాళ్లకు మీ ఓట్లు కావాలి, వాళ్ల మంత్రులు కావాలి, అయినా మీకు ఇచ్చిందేంటో అడగాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నారని, కనీసం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు అనుమతులు ఇప్పియ్యలేక పోయారని దుయ్య బట్టారు. మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పిస్తే 1.5లక్షల ఎకరాలు సాగయ్యి రైతుల్లో ఆనందం వెల్లివిరిసేదన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదటి సభ ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో పెట్టగా, రెండోసభ మంచి ర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నిలబడి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఈ రెండు సభలే పునాది అని రేవంత్ అన్నారు. ఇక్కడి స్ఫూర్తి తోనే రాష్ట్రంలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల విభాగంలో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి బరిలో నిలుస్తున్నారని, ఆయనను గెలిపిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు అవుతుందని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఉన్న యూనివర్శిటీలు అన్ని కాంగ్రెస్ ఇచ్చినవేనని, పదేళ్ల పాల నలో బీఆర్‌ఎస్ ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివ ర్శిటీని ఏర్పాటు చేస్తున్నామని, వివిధ రంగాల వారికి నైపు ణ్యం పెంచనున్నట్లు తెలిపారు. స్కిల్ యూనివర్శిటీ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రణాళిక ఉందన్నారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన మోదీ ఇప్పటివరకు ఒక్కటి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గడిచిన 12 ఏళ్లలో మోడీ తెలంగాణకు కోటి ఉద్యోగాలు బకాయి పడ్డారని అన్నారు. బీజేపీకి ఓటు అడిగే హక్కు ఎక్కడి దని ఆయన ప్రశ్నించారు. ఐటీఐ చదువులకు చేస్తున్న ఉద్యోగాలకు అసలే సంబంధమే లేదని, ఐటీఐ విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ చేసేందుకు ఏటీసీలుగా నామకరణం చేసిన ట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడ్డ 12 నెలల కాలంలో..

మిగతా 7లో

సీఎం సభ సైడ్ లైట్స్

- నస్పూర్‌లో ఏర్పాటు చేసిన పట్టబద్రుల ఆత్మీయ సమ్మేళన సభకు సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2.20 గంట లకు రావాల్సి ఉండగా 3.30 గంటలకు చేరుకున్నారు. గంట పది నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు.
- సభకు చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేసారు... ఒక్కసారిగా జనాలు కేకలు, చప్పట్లు, కేరింతలతో మోగిపోయింది.
- కాంగ్రెస్ కార్యకర్తలు, వలంటరీలు సభలో కూర్చున్న వారికి నీటిని అందించాలని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ సూచించారు.
- ముఖ్యమంత్రి వస్తున్న హెలిక్యాప్టర్‌ను చూసి జనాలు లేచి కేరింతలు, విజిల్ వేసారు.
- సీఎం రేవంత్‌రెడ్డి సుమారు 30 నిమిషాల పాటు ప్రసంగించారు. ఒకవైపు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలపై విమర్శలు విసురుతూనే రాష్ట్రంలో చేపట్టిన ప్రగతిని వివరిస్తూ ఆకట్టుకున్నారు.
- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిస్తామని సభ లో పాల్గొన్న పట్టభద్రులచే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ప్రతిజ్ఞ చేయించారు.
- సీఎం ప్రసంగం 5.25 గంటలకు ముగించుకుని హెలి ప్యాడ్‌కు బయలుదేరి వెళ్లిపోయారు.
- సీఎం పర్యటన విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసిది.

ఏళ్లుగా ఉంటున్నాం..ఇప్పుడేం సర్వే

- రెవెన్యూ అధికారులను అడ్డుకున్న స్థానికులు



ఇందారంలో సర్వేయర్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

జైపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లుగా ఇళ్ల నిర్మించుకుని తాతలు, తండ్రుల కాలం నుంచి తాము ఇక్కడ జీవిస్తున్నాం.. తమ ఇండ్ల అడుగు భూమిని ముత్యంరావు వారసుడిగా చెప్పుకునే ఆనంద్ కృష్ణ మోస పూరిత పట్టాలు చేసుకున్నాడు. ఇందులో హద్దులు గుర్తించేందుకు ఇప్పుడు సర్వే ఏందీ అంటూ ఇందారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇందారం గ్రామంలో 1113 సర్వే నెంబరులో హద్దులను గుర్తించేందుకు సోమవారం సర్వేయర్ రామస్వామి సర్వే నిర్వహిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వందల ఏళ్లుగా ఇండ్లు నిర్మించుకుని తాము ఇక్కడ జీవిస్తున్నామని, ఆనంద్‌కృష్ణ అనే వ్యక్తి మోస పూరిత పట్టాలు చేసుకున్నాడని పేర్కొన్నారు. మిగులు భూములను గ్రామంలో పట్టాలు లేకుండా ఉన్న భూములను రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాలు చేసుకుని సర్వే పేరుతో స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వందల ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న భూములకు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటి అడుగు స్థలాలను పట్టాలు చేసుకుని గుంటకు డబ్బులు కావాలని డిమాండ్ చేసి పట్టా చేస్తానని చూస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఇందారం భూ మివ్యవహారంపై విచారణ జరిపి అక్రమంగా పట్టా చేసుకున్న వారిని, వారికి సహకరించి పట్టాలుచేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్వేయర్‌కు వినతి పత్రం అందించారు. సర్వేయర్‌ను, రెవెన్యూ సిబ్బంది గ్రామస్థులు అడ్డు కోవడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

కొంటరా..కొనరా..

- పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని రైతుల రాస్తారోకో



చెన్నూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చెన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదంటూ మంచిర్యాల జిల్లా చెన్నూర్‌నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. చెన్నూరు-మంచిర్యాల ప్రధాన రహదారి చెన్నూరు కాటన్ మిల్లు వద్ద రోడ్డుపై బైఠాయించారు.

సీసీఐ అధికారుల తీరును ఎండ గడుతూ దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో ఎటు వాహనాలు అటే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 20రోజుల నుంచి పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. మూడు రోజుల క్రితం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్టణంలోని పత్తి మిల్లులను సందర్శించి పత్తి కొనాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రెండు రోజుల పాటు కొనుగోళ్లు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. లేని పోని ఆంక్షలు విధిస్తూ పై నుంచి పత్తి కొనుగోలు చేసే ఆదేశాలు రాలేదంటూ అలసత్వం వహిస్తున్నారని రైతులు వాపోయారు. రోజుల తరబడి ఇక్కడే ఉంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులు, అధికారులతో సంప్రదింపులు జరిపి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నిక ల్లో భాగంగా ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరగనున్న పోలింగ్ కొరకు బ్యాలెట్ బాక్స్‌ల ర్యాండమైజేషన్‌ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు.సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలె క్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి అధికారులు, రాజకీయ ప్రతినిధులతో ర్యాండ మైజేషన్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టభ ద్రుల ఎన్ని కల కొరకు 48జంబో బ్యాలెట్ బాక్సులు కేటాయించగా అందులో 8అదనపు బాక్స్‌లు, 48స్మాల్ బాక్సులు కేటాయించగా అందులో 8అదనపు బాక్స్‌లు, ఉపాధ్యాయుల ఎన్నికలకొరకు 44స్మాల్ బ్యాలెట్ బాక్స్‌లు కేటాయించగా అందులో 8అదనపు బాక్స్‌లను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో40 పట్టభద్రులు, 18 ఉపాధ్యాయల ఎన్నికల కొరకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాక్సులను భద్రత చర్యలమధ్య పోలింగ్‌కేద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పట్టణంలోని బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేసి చెన్నూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణ మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేష్, కిష్టంపేట మాజీ సర్పంచు బుర్ర రాకేష్‌గౌడ్, నాయకులు షఫీ, మహేం దర్‌లను అరెస్టు చేశారు.

కోటపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కోటపల్లిలో అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, నాయకులు కొట్టి నారాయణ, అక్కలమధుకర్, రాళ్లబండి స్వామి, సంపత్‌కుమార్, బాపునాయక్, మల్లేష్ ఉన్నారు.

జైపూర్ : జైపూర్ మండలంలో అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్దపల్లి రమేష్, పడాల మ ల్లగౌడ్, జగన్‌గౌడ్, శేఖర్ ఉన్నారు.

భీమారం : మండలంలో అరెస్టు అయిన వారిలో నాయకులు దాసరి మధునయ్య, కుమ్మె సాగర్, బబ్లు, వడ్లకొండ పవన్, దాసరి మణి దీపక్‌లు ఉన్నారు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్

విద్యుత్ శాఖ ఏఈ రమేష్



ఆంధ్రజ్యోతి: వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ అందిస్తున్నారు?
ఏఈ : వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందిస్తున్నాం.
ఆంధ్రజ్యోతి: గృహజ్యోతి పథకంలో విద్యుత్ సబ్సిడీ రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు కదా?
ఏఈ : గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు ప్రతీ వినియోగ దారుడికి సబ్సిడీ వస్తుంది. ఒకే ఇంట్లో ఒక రేషన్ కార్డుకు మాత్రమే గృహజ్యోతి పథకం వర్తిస్తుంది.
ఆంధ్రజ్యోతి: కొన్ని గ్రామాల్లో ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి వాటి వల్ల ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది?
ఏఈ : అటువంటి వాటిని గుర్తించాం. రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉన్న వాటిని గుర్తించి వాటి స్థానంలో పోల్ పై మరో 9.1 ఎత్తులో ఉండే పోల్‌ను జాయింట్ చేసి ఎత్తు పెంచుతున్నాం.
ఆంధ్రజ్యోతి: ఆయా గ్రామాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు ఉన్నాయి వాటిని ఎప్పుడు తొలగిస్తారు?
ఏఈ : గ్రామాల్లో వంగిన స్తంభాలు గుర్తించాం. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. త్వరలోనే వంగిన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం.

- కెరమెరి (ఆంధ్రజ్యోతి)

శిక్షణ ఇచ్చారు..

ధ్రువీకరణ పత్రాలు మరిచారు

మేదరి కులస్తుల ఎదురుచూపులు

దహెగాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తుల వారికి శిక్షణ ఇచ్చారు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో మేదరి కులస్తులకు ఎదురు చూపులు మిగులుతున్నాయి. వెదురుతో తయారు చేసే కళాకృతులపై మేదరి కులస్తులు, పీటీజీ (ట్రైబల్స్)లకు నెలరోజుల పాటు డీఆర్‌డీవో, మిథాన కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఏడాది సమీపిస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని మేదరి కులస్తులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లోని సుమారు 400 మంది మేదరి కులస్తులు, పీటీజీలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రాలు, శిక్షణ కేంద్రానికి రాకపోకలు సాగించడానికి ఒక్కొక్కరికి రవాణా చార్జీ లు రూ.100 చెల్లిస్తారు. రెబ్బెన, వాంకిడి, దహెగాం, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, తిర్యాణి మండలంలోని మంగి, కాగజ్‌నగర్ మండలంలోని కోయగూడ, ఇర్పాన్‌నగర్, చింతలగూడ గ్రామాల్లోని మేదరి కులస్తులకు, పీటీజీలకు శిక్షణ ఇచ్చారు. వెదురు కళాకృతులు ఫోన్‌స్టాండు, టీ ట్రేలు, తలంబ్రాల గంప, పూజా సామగ్రి తీసుకెళ్లేటప్పుడు, బొకేలు, నిశ్చితార్థంలో పండ్లు తీసుకెళ్లే ట్రేలు పలు రకాల వస్తువుల తయారీపై హ్యాండ్ క్రాఫ్ట్ మాస్టర్ శిక్షణ ఇచ్చారు.


వెదురుతో కళాకృతుల తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు


శిక్షణ పొందిన మేదరికులస్తులు, పీటీజీలు

సాలెగూడలో పరిశ్రమ:

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సాలె గూడలో రూ.16 లక్షలతో వెదురు కళాకృతుల పరిశ్రమ ప్రారంభం కానుంది. పరిశ్రమకు సంబంధించి మిషనరీలు వచ్చాయి. విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. పరిశ్రమ ప్రారంభమైతే పలువురికి ఉపాధి దొరికే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాలు అందించాలి
దీకొండ రమేష్, అయినం



దహెగాం రైతు వేదికలో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. రవాణా చార్జీలు ఇయ్యలేదు. నెలరోజులు శిక్షణకు వెళ్లాను. ప్రతాల కోసం ఎదురుచూస్తున్నా.

ఎన్నికల కోడ్ ముగిసాక అందిస్తాం:
రామకృష్ణ, డీఆర్‌డీఏ ఏపీడీ

కుల వృత్తుల వారికి శిక్షణ ఇచ్చిన మాట వాస్తవమే. అదే విధంగా ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన తరువాత ధ్రువీకరణ పత్రాలతోపాటు రోజుకు రూ.100 చొప్పున ఒక్కొక్కరికి రూ.3 వేలు చెల్లిస్తాం.

ఎదురు చూస్తున్నాం
బురం వెంకటమ్మ, రాంపూర్



ధ్రువీకరణ పత్రాలు, రవాణా చార్జీల కోసం ఎదురు చూస్తున్నాం. అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. ఏడాది దాటింది. జనవరి-2024లో శిక్షణ ఇచ్చారు. అధికారులు తొందరగా ఇయ్యాలి.

కరాటే పోటీల్లో ప్రతిభ

గర్మిళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న మంమదర్రిలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. లోకేష్, అభి గోల్డ్‌మెడల్, అభిలాష్, ఎండీ ఆసిఫ్, సహెల్‌లు, ప్రణయ్‌లు సిల్వర్ మెడల్‌లు సాధించారు. ఈ సందర్భంగా వీరిని మాస్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వేంకటేష్ ధోత్రే సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మార్చి 5వ తేదీ నుంచి 25 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి దాదాపు 10వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతీ పరీక్ష కేంద్రంలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సౌకర్యార్థం కోసం సమయానుసారంగా బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ ప్రభాకర్‌రావు , ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కళ్యాణి, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేంకటేష్ ధోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

కలగానే సాంకేతిక విద్య

- జిల్లాలో నేటికీ ఏర్పాటు కాని పాలిటెక్నిక్ కళాశాల

- నైపుణ్యాలు లేక వెనుకబడుతున్న విద్యార్థులు

రెబ్బెన, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలతో పాటు విద్యారంగంలో వెనుకబడిన కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్‌లో ఇప్పటి వరకు నైపుణ్యం మాట పక్కన పెడితే కనీసం సాంకేతిక విద్యావకాశాలు కూడా అందుబాటులో లేవు. కాగజ్‌నగర్‌లో ఒకే ప్రైవేట్ ఐటీఐ కళాశాల ఉంది. గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో లేకపోవటంతో అంతా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రాకతో ప్రపంచం వేగంగా మారుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆయా రంగాల్లో నైపుణ్యాలు పెంచుకునే వారి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెరిగేందుకు మార్గాలున్నాయి. జిల్లాలో పాలిటెక్నిక్ కోర్సులు లేవు. ఈ కోర్సులు ఉంటే తక్కువ సమయంలోనే ఉద్యోగ అవకాశాలు సాధించే అవకాశం ఉంది. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారికి సింగరేణిలో వేతనంతో కూడిన శిక్షణ (అప్రెంటీస్ షిప్) ఇవ్వటానికి ముందుకు వస్తోంది. అలాగే ఆర్టీసీ వంటి ఇతర సంస్థలు కూడా ప్రొత్సాహిస్తున్నాయి. ఈకారణం చేత జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని అంతా డిమాండు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అవకాశాలు లేకపోవటంతో హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల్లోని సాంకేతిక కళాశాలలకు వెళ్లాల్సిన దైన్య పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా నాయకులు, అధికారులు వెంటనే స్పందించి జిల్లాకు వెంటనే ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

కళాశాలలు వెంటనే ఏర్పాటు చేయాలి

- బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి



కుమురం భీం జిల్లాలో కళాశాలలో సాంకేతిక విద్య నేర్చుకునేందుకు ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు లేవు. విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కుమరం భీం జిల్లాలో సాంకేతిక కళాశాలలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

బీజేపీతోనే పట్టభద్రుల సమస్యల పరిష్కారం

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపించాలని పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కోరారు. సోమవారం బెల్లంపల్లిలోని తాపీ సంఘం భవనంలో బీజేపీ నాయ కులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు తిరుపతి, రజనీష్ జైన్, కృష్ణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి చిన్నమైల్

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు గనులపై ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులు, ఏరియా వర్క్‌షాప్‌లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సత్రం రమేష్, కుర్రె చక్రి, నాతాడి శ్రీధర్‌రెడ్డి, మిట్టపెల్లి మొగిలి, కాశెట్టి నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాలి..

లక్సెట్టిపేట (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి బుద్ది చెప్పాల్సింది కేవలం పట్టబద్రులకే సాధ్యం అవుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14నెలల కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులు ఉద్యోగులు ఎవరూ కాంగ్రెస్ పార్టీకి ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. మాట తప్పిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాత్ వెరబెల్లి, నాయకులు రజినీష్‌చంద్‌జైన్, మున్నారాజా సిసోడియా, గోమాత శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ముత్తె సత్తయ్య, తమ్మినీడి శ్రీనివాస్, హరిగోపాల్‌రావు, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని చేతి పంపు

వాంకిడి, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని శివాలయం చౌరస్తాలో గల చేతి పంపు మరమత్తుకు నోచుకోక పోవడంతో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ గురువారం మండల కేంద్రంలో సంత జరుగుతుంది. వార సంతకు మండలం లోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఈ చౌరస్తా నుంచే వెళ్తుంటారు. సంతకు వచ్చే ప్రజలు ఈ చేతి పంపు వద్ద దాహార్తిని తీర్చుకుంటరు. నాలుగు నెలల నుంచి చేతి పంపు చేడిపోయినప్పటికి పంచాయతీ అధికారులు పట్టిం చుకోవడంలేదు. ఈ నెల 26న మహాశి వరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో రెండు రోజులు జాతర జరుగుతుంది. జాతరకు వచ్చే భక్తులు ఈ ప్రాంతం నుంచి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు చేతి పంపును మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పనిచేయని చేతి పంపు



బాధ్యతలు స్వీకరించిన జీఎం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా నూతన జీఎంగా విజయ భాస్కర్‌రెడ్డి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏరియా అధికారులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉ మాకాంత్, పర్సన్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

సెలవు మంజూరు చేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే పట్టభద్రులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి. అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా సెలవు ఇవ్వాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే పట్టభద్రులకు ఆన్‌డ్యూటీగా పరిగణించాలని బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఎస్ఓ టు జీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

స్టోర్స్ ఇష్యూ మజ్దూర్లుగా పదోన్నతి కల్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గనుల స్టోర్లలో ఉన్న జనరల్ మజ్దూర్లకు స్టోర్స్ మజ్దూర్లుగా పదోన్నతి కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆర్కే 5 గనిని సోమవారం సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. గని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చిగురు లక్ష్మణ్, మిడివెల్లి శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, తిరుపతి, సురేందర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్వీన్స్‌లాండ్‌తో ఖనిజాల ఉత్పత్తికి పరస్పర సహకారం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సింగరేణి సీఎండీ బలరాం

మందమర్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కీలక ఖనిజాలు మైనింగ్ రంగంలో తెలంగాణకు పూర్తి సహకారం అందించేందుకు క్వీన్స్ లాండ్ మంత్రి రోసోవ్‌బెట్స్ (ఆస్ట్రేలియా) తెలిపారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో తెలంగాణ క్వీన్స్‌లాండ్ సంయుక్త మైనింగ్ సంబంధించి జరిగిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఖనిజాల టెక్నాలజీ మైనింగ్ రంగంలో పరస్పర సహకారం భాగస్వామ్యానికి ముందడుగు వేయడం తెలంగాణ రాష్ట్రానికి శుభపరిణామం అని తెలిపారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి క్వీన్స్‌లాండ్ బృందానికి అభినందనలు తెలిపారు. విద్యుత్ వాహనాలు సోలార్ విద్యుత్, బ్యాటరి స్టోరేజీ సిస్టంలకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యం లో వెనేడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి పదకొండు రకాల ఖనిజాలు ఎంతో అవసరం ఉన్నాయని, ఈ ఖనిజాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుం టున్నామన్నారు. ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ లాండ్‌లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందం రెండు రాష్ట్రాలు చేకు న్నాయన్నారు. క్వీన్స్‌లాండ్‌తో కీల క ఖనిజాలు వెలికితీత, భారీ ఖనిజం ఉత్పత్తి యంత్రాలు, సాంకేతిక రక్షణ పెంపుదలకు వెంటిలేషన్ పెరుగుదల, తదితర అంశాలపై పరస్పర అవగాహనతో వ్యాపారం ఒప్పందం కోసం ముందుకు వెళ్తున్నామన్నారు. త్వరలోనే వీటి పై అధ్యయనం, అవగాహన కోసం సింగరేణి నుంచి ఒక బృందాన్ని క్వీన్స్‌లాండ్‌కు పంపు తున్నట్లు తెలిపారు. క్వీన్స్‌లాండ్ మంత్రి రోసోవ్‌బెట్స్ మాట్లాడుతూ మైనింగ్‌రంగంలో అనుభవం ఉన్న సింగరేణితో సంబంధాలను మరింత బలోపేతం చేయడం కోసం రాష్ట్రానికి వచ్చామన్నారు. ఇరురాష్ట్రాల పరస్పర సహకారంతో వ్యాపార ఒప్పందం చేసుకొని అభివృద్ధి పథంలో వెళ్లడానికి సమావేశం ఉపకరిస్తుందని ఆశాభావం తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బల్‌రాం పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న డిప్యుటీ సీఎం భట్టివిక్రమార్క, సీఎం బలరాం

క్రికెట్ జట్టు విజేత ఆర్‌కే 6 గని

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని క్రిష్ణకాలనీలోని శాంతిస్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆర్‌కే 6 గని విజేతగా నిలిచింది. మహాలక్ష్మీ చిల్డ్రన్స్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో బ్యాంకర్స్ జట్టు, ఆర్‌కే 6 జట్టు తలపడగా, 30 పరుగుల తేడాతో ఆర్‌కే 6 జట్టు విజయం సాధించింది. విజేతలకు బహుమతులు అందించారు.


ట్రోఫీని అందుకుంటున్న సభ్యులు

కుందారంలో పులి సంచారం

- అడవుల్లోకి రైతులు వెళ్లవద్దు

జైపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం అటవీ ప్రాంతం నుంచి మండలంలోని కుందారం అటవీ ప్రాంతంలోకి పులి సంచారం చేస్తుందని కుందారం అటవీ సెక్షన్ ఆఫీసర్ భగవంత్‌రావు పేర్కొన్నారు. సోమవారం కుందారం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీ పనులకు వెళ్లేవారు అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దన్నారు. పశువులను, మేకలను అటవీ ప్రాంతం వైపు తీసుకువెళ్లవద్దని, ఇళ్లలోనే ఉంచుకోవాలన్నారు. కుందారం అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు. పులికి ఎవరు హాని తలపెట్టవద్దని సూచించారు. సమావేశంలో ఎఫ్‌బీవో శ్రీధర్, ఎఫ్‌డీసీ సాయికిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల విజేత రమేశ్



ట్రోఫీ అందుకుంటున్న రమేశ్

మందమర్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం డ్రీమ్ యోగా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆయా విభాగాల్లో నాలుగు ప్రథమ బహుమతులను కొంపెల్లి రమేశ్ సాధించారు. రాత్రి వరకు సాగిన ఈ పోటీల్లో యోగాపుత్ర ట్రోఫీతో పాటు 30 ఇయర్స్ మెన్స్ చాంపియన్‌షిప్ యోగా ఉపన్యాసానికి సంబంధించి ప్రథమ బహుమతి, 56 నుంచి 60 సంవత్సరాల క్యాటగిరిలో ప్రథమ బహుమతి, డొమెస్టిక్ యోగా విన్యాస ప్రదర్శనలో బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి సాధించిన రమేశ్‌ను నిర్వహకులు ఘనంగా సన్మానించారు. రమేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. డ్రీమ్ యోగా నిర్వహకులు ముల్కల్ల శంకర్, ఎగ్గడి రాజేశ్వర్‌రావు, లయోల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య


సంధ్య (ఫైల్)

రెబ్బెన, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి సంధ్య(21) అనే యువతి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన గోలేటిలోని రమణరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పోషం కుమార్తె సంధ్య హైదరాబాద్‌లోని ఓ బిస్కెట్ కంపెనీలో పని చేస్తోంది. వారం రోజుల క్రితం గోలేటికి వచ్చింది. వ్యక్తిగత కారణాలతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడినుంచి బెల్లంపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు సంధ్య కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వాంకిడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లి గ్రామ సమీపంలో సోమవారం మహారాష్ట్రలోని జీవితి తాలుక హెరెవా గ్రామానికి చెందిన హోడెబె సుదాం(33) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జీవితి తాలుక హెరెవా గ్రామానికి చెందిన హోడెబె సుదాం అనే యువకుడికి భార్య సావిత్రిబాయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్ని రోజుల నుంచి వాంకిడి మండలంలో కుటుంబసభ్యులతో కలిసి పత్తి తీయడానికి కూలీపనులకు వెళ్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై కూలీ పనులకు వెళ్లి సంపాదించిన మొత్తం డబ్బులను మద్యానికి ఖర్చు చేసుకుంటున్నాడు. ఆదివారం భార్యతో కలిసి అత్తగారింటికి మహారాష్ట్రలోని హీరాపూర్ గ్రామానికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆయన తన ద్విచక్రవాహనంపై వాంకిడి మండల కేంద్రానికి వచ్చాడు. స్థానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేసి ఆర్లి గ్రామ సమీపంలోని పత్తి చేనులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుదాం అన్న హోడెబె సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష, మరొకరికి జరిమానా

జన్నారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురిమడుగు గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రహరీ గోడ నిర్మిస్తున్న వారిని తిట్టి బెదిరింపులకు గురి చేసిన ఇద్దరు వ్యక్తులకు సంవత్సరం సాధారణ జైలు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. 2017 మే నెలలో మురిమడుగు గ్రామంలో సీఎస్ఐచర్చి గోడ ప్రహరీ నిర్మిస్తున్న వారిని అదే గ్రామానికిచెందిన గోలి రాంచందర్ , కొండగొర్ల శ్రీనివాస్‌లు బూతులు తిట్టారని పాస్టర్ పాగె జాన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా అప్పటి ఎస్ఐ ప్రసాద్‌కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో గోలి రాంచందర్‌కు రూ. 10 వేల జరిమానా, కొండగొర్ల శ్రీనివాస్‌కు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

లారీ అసోసియేషన్‌ను విచ్ఛిన్నం చేసే కుట్ర

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ సభ్యుల ఐకమత్యంతో నడుస్తోందన్నని, దీన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని లారీ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్‌లో మరో లారీ అసోసియేషన్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు మాజీ అధ్యక్షుడు కిషోర్‌బాబు, ఇతరులు కుట్ర పన్నుతున్నట్టు ఆరోపించారు. సమావేశంలో లారీఅసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణకు మోకుదెబ్బ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడి మద్దతు

జన్నారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు, ఓయూ పూర్వ విద్యార్థి, విద్యావేత్త ప్రసన్న హరికృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు మోకుదెబ్బ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు రాజుగౌడ్ ఎరుకల ఒక ప్రకటనలో తెలిపారు. రెండు జాతీయ పార్టీలు అగ్రవర్ణ అధిపత్య కులానికి టికెట్లు కేటాయించి 90 శాతం జనాభా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను విస్మరించాయన్నారు. నిరుద్యోగుల గొంతు కగా ఉండే హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించా లని కోరారు.

పద్యాల పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

చెన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తటపర్తి అంతర్జాతీయ గురుకుల ఆధ్వర్యంలో సోమవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పద్యాల పోటీల్లో పది మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ పట్వర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్, ఐకేఏసీ కో ఆర్డినేటర్ రామకృష్ణ, కెరీర్ గైడ్‌లైన్స్ కో ఆర్డినేటర్ జగ్‌పాల్, అధ్యాపకులు ముకుంద్, సురేష్‌గౌడ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

నాగులమ్మ ప్రతిష్ఠ కార్యక్రమం

జైపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకుమట్ల గ్రామంలోని గోదావరి నది ఒడ్డున సోమవారం నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టేకుమట్ల గ్రామానికి చెందిన రాగం కృష్ణవేణి- కొమురయ్య దంపతులు సొంత ఖర్చులతో నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఓసీపీ పీవో వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల మూసివేత

చెన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ చెన్నూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లను సోమవారం యజమానులు మూసివేశారు. వారం రోజులుగా మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ వాటర్ ప్లాంట్ల యాజమానులకు ఐఎస్‌వో స్టాండర్డ్స్ పాటించాలని నోటీసులు జారీ చేశారు. లక్షలు పెట్టి ఐఎస్‌వో స్టాండర్స్‌తో మెయింటేన్ చేయలేమని యజమానులు ప్లాంట్లను మూసివేయడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

లోక కల్యాణార్థం మహాలింగార్చన

తాండూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూర్ పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి దేవాలయంలో లోక కల్యాణం కోసం మహాలింగార్చన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి చంద్రశేఖర్, కేశెట్టి సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 26న సా యంత్రం 5 గంటల నుంచి మహాలింగార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎటువంటి టికెట్టు కానీ విరాళాలు కానీ చెల్లించే అవసరం లేదన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోచమ్మ బోనాలు

కన్నెపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాడవెల్లి పంచాయతీలోని పాత మాడవెల్లి గ్రామంలోని పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఘనంగా నిర్వహించారు. భాజబ జంత్రీలతో నృత్యాలు చేస్తూ ఆట పాటలతో బోనాలు పోసి నైవేద్యాలను సమర్పించి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ఓట్లు అడుగుతున్నారు

(5వ పేజీ తరువాయి)

11 వేల మంది ఉపాధ్యాయుల నియామకం, 15 వేల మందికి పోలీసు శాఖలో ఉద్యోగాలు, 6 వేల మంది పారా మెడికల్ సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు వివిధ శాఖలో 55, 103 మంది నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇవన్నీ నిజమైతేనే కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని, అబద్ధమైతే మీ ఓట్లు ఎవరికి వేసినా తమకు అభ్యంతరం లేదన్నారు. బీసీ కులగణన వందేళ్లలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేపట్టిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుకోని తప్పిదం ఏదైనా జరిగితే బీసీ కులగణన చేసినందుకే నన్న ముద్ర పడుతుందన్నారు. ఈ విషయమై బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తప్పుడు ప్రచారం చేయవా అని పట్టభద్రులను ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యేగా ప్రేమ్‌సాగర్ రావు ఉండడం ప్రజల అదృష్టమని, ఆయన పట్టుదలతో నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయల పనులు చేపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సభా వేదికగా ప్రేమ్ సాగర్ రావు కోరిన 78 కోట్ల రూపాయలతో పట్టణ అభివృద్ధి, 12 కోట్ల రూపాయలతో గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం అభివృద్ధి, 3 కోట్లతో మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయం అభివృద్ధికి పూనుకుంటుండగా, వాటిని మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగాలు ఇచ్చే సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఖాళీలన్నీ భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థను తమ ప్రభుత్వం గాడిన పెడుతుందన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై బీజేసీ, బీఆర్ ఎస్‌లు ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు చేస్తున్నాయన్నారు. తమ హయాంలో ఉద్యోగాలు, ఉపాధి ఇవ్వకుండా ప్రస్తుతం ప్రజలను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంచిర్యాలతో తనకు 25 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే చేదోడువాదోడుగా ఉంటానని, పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉన్నందున పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేటు విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు రూ.3 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, గండ్ర సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లాలోని పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో హెలిప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, బొజ్జు, వినోద్

అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

నస్పూర్/శ్రీరాంపూర్ : మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌తో తరువాత మంచిర్యాలలో ప్రభుత్వపరంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో మంచిర్యాల నగరం ముంపునకు గురికాకుండా ఉండేందుకు సీఎం అడిగిన వెంటనే కరకట్టలు మంజూరు చేశారన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నగరంలో దశాబ్దాలుగా హిందూ శ్మశానవాటిక లేదని, గోదావరి రోడ్డులో మహా ప్రస్థానం 11 కోట్ల రూపాయలతో అన్ని హంగులతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ముఖ్యమంత్రి దత్తత తీసుకున్నారని, అభివృద్ధికి ఆయన కట్టుబడి ఉన్నారని తెలిపారు.

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు 15 నుంచి 18 శాతం కేటాయించాలని, నేతకాని, మాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని, లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 1000 కోట్ల రూపాయలు ఇవ్వాలని, ఇంకా 3 వేల కోట్లు మంజూరు చేయాలని అన్నారు.

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, తన నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి మూడు కాలేజీలు మంజూరు చేశారని, మరో ఇంజనీరింగ్ కళాశాల ఇప్పించాలని అన్నారు.
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పోటీ ఉందన్నారు. గెస్ట్ లెక్చరర్లు, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ-ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ, మంచిర్యాల మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చారన్నారు. ఈ విషయమై ఆమె సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నస్పూర్ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని ఆశీర్వదించడానికి వచ్చిన పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికే ఓటు వేస్తామని పట్టభద్రులతో సంకల్పం చేయించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

నస్పూర్/శ్రీరాంపూర్ : పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నస్పూర్‌లోని కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్ద మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, వివేక్ వెంకట్ స్వామి, గడ్డం వినోద్, వెడమ బొజ్జు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్‌కు 3.30 గంటలకు, చేరుకోగా ఆయనకు బొకేలను అందించి స్వాగతం తెలిపారు. ముఖ్యమంత్రికి వినతి పత్రాలను అందించారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్ ద్వారా సభ స్థలికి చేరుకున్నారు.





సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క..మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

స్వయం ఉపాధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీవో కిషన్

నెన్నెల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సెర్ప్ ద్వారా అందించే స్వయం ఉపాధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. న్యూ ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా నందులపల్లి, మన్నెగూడం గ్రామాల్లోని పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు, అజోళ్ల పిట్లు, పశువుల పాకల నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. యూనిట్ల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాకే ఆదర్శంగా నిలిచేలా యూనిట్లను నడిపించుకోవాలన్నారు. అందుకు స్థానిక అధికారులు ఎప్పటిప్పుడు లబ్ధిదారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి, కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడానికి సెర్ప్ రుణాలు ఉపయోగపడుతున్నా యన్నారు. అనంతరం ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలల్లో ప్రహారీల నిర్మాణాలను మార్చి 10వ తేదిలోగా పూర్తి చేసి బిల్లులు చెల్లించా లన్నారు. వ్యవసాయ అభివృద్ధి కోసం చేపడుతున్న ఉపాధిహామి పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.



నందులపల్లిలో అజొళ్ల పిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

తాగునీరు వృథా



దేవాపూర్‌లో రోడ్డుపై పారుతున్న తాగునీరు

కాసిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ పంచాయతీ పరిధిలోని లచ్చిరెడ్డిగూడెంలో తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృధాగా పోతోంది. వేసవిలో నీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో తాగునీరు రోడ్డుపై వృథాగా పోవడంతో నాయకపుగూడ, మేదరివాడలకు తాగునీరు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ పగలడంతో నీరు పైకి వెళ్లలేక లీకై వృధాగా పోతుంది. దీంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మత్తులు చేసి నీటి వృధాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక కార్యకలాపాలను ప్రణాళికాబద్ధంగా చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక కార్యకలాపాలను ప్రణాళికబద్ధంగా చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో భారతీయ రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక కార్యకలాపాలు ప్రణాళికబద్ధంగా చేయాలని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. బాధ్యతాయుతంగా అప్పు చేయాలని, సమాయానికి తిరిగి చెల్లించి మంచి క్రెడిట్ స్కోర్ కొనసాగించాలన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్‌మేనేజర్ తిరుపతి, డీఆర్‌డీవో కిషన్, అధికారులు దుర్గా ప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణపూర్‌లోని ఆల్ఫో న్సా పాఠశాలలో 2002లో చదువుకున్న బిల్లా వంశీ 2004లో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వంశీతో చదువుకున్న పూర్వ విద్యార్థులందరు కలిసి సుమారు రూ. 7 లక్షల విరాళాలు సేకరించారు. వంశీ పిల్లల పేరు మీద రూ. 7 లక్షలను పోస్టాఫీసులో నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంలో డిపాజిట్ చేసి సోమవారం డిపాజిట్ బుక్‌ను వంశీ భార్య స్రవంతికి అందజేశారు. మిత్రులను పలువురు అభినందించారు.

‘మధ్యాహ్నం’ నాణ్యతపై దృష్టి

ఎంపిక చేసిన బడుల్లో కొనసాగుతున్న సామాజిక తనిఖీలు

కోటపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు మరింత నాణ్యతగా అందించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఉత్తర్వులతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరుపై అధికారులు దృష్టి సారించారు. భోజనం ఎలా ఉంటుంది, విద్యార్థులకు నాణ్యతగా అందిస్తున్నారా లేదా, బియ్యం నిల్వలు ఎలా ఉన్నాయి, వంట గదుల్లో పరిశుభ్రత తదితర అంశాలపై సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. సీఎం పోషణ్ అమలులో భాగంగా సామాజిక తనిఖీలను చేపడుతున్న అధికారులు ఎంపిక చేసిన బడుల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారించారు.

జిల్లాలో 26 పాఠశాలల్లో తనిఖీలు

మధ్యాహ్న భోజనం పథకం అమలుపై సామాజిక తనిఖీలు చేపట్టేందుకు జిల్లాలోని 14 మండలాల్లో 26 పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలలను సామాజిక తనిఖీ బృందాలు సందర్శిస్తున్నాయి. పాఠశాలల్లో భోజనం నాణ్యతగా ఉందా, మెను ప్రకారం భోజనం అమలు చేస్తున్నారా లేదా అనే విషయాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు.



పాఠశాలలకు సరఫరా చేస్తున్న బియ్యం వివ రాలు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా వినియోగం, నిల్వలను పరిశీలించడంతో పాటు వాటికి సంబంధిం చిన రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

వారంలో మూడు సార్లు కోడిగుడ్లను పిల్లలకు అందిస్తున్నారా లేదా మధ్యాహ్న భోజన కార్మికుల వ్యక్తిగత శుభ్రత, వంట గదుల పరిశుభ్రత తదితర అంశాలపై పరిశీలన జరుపుతున్నారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు మరింత నాణ్యతగా అందించేందుకు సామాజిక బృందాలు తనిఖీలు చేపడుతుండగా తనిఖీల పూర్తి తర్వాత నివేదికలను ఉన్నత అధికారులకు అందజేయనున్నారు.

కోటపల్లిలో: కోటపల్లి మండలంలో ఎంపిక చేసిన పాఠశాలలైన శివరాంపల్లి ప్రాథమిక పాఠశాల, పారుపెల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, పుల్లగామ ప్రాథమిక పాఠశాల, పారుపెల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు సిర్సా, జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో బృందాలు సామాజిక తనిఖీలు చేపడుతున్నాయి. పాఠశాలల్లో సామాజిక తనిఖీలు అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నివేదికల ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పేద ప్రజలకు ఇళ్ల కోసం మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ నాయకులు ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇళ్లు లేక చాలా మంది అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారని పేద ప్రజల సమస్యను పట్టించుకుని పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేదరి దేవవరం, రమణరెడ్డి, బానుచందర్, రవికిరణ్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అండర్ 16 విభాగంలో మానస, చందన, అక్షయ అండర్ 14 విభాగం కటాస్‌లో నీక్షిత, సహస్ర, శ్రీఅచ్చితలు, అండర్ 12లో సాయిఅచ్చిత, అక్షిత, అనూషలు గెలుపొందారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. రాష్ట్రస్థాయిలో గెలు పొందిన విద్యార్థులు జాతీయ స్థాయిల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు, మాస్టర్ బచ్చల అంజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండోర రాష్ట్ర మహా సభలకు తరలిరండి

మందమర్రి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లెదర్ పార్కుల ప్రారంభంతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం లెదర్ పార్కుల ప్రారంభోత్సవానికి చొరవ చూపాలని మాదిగ హక్కుల దండోర మందమర్రి పట్టణ అధ్యక్షులు కొలగూరి విజయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సులు పేర్కొన్నారు. పట్టణంలో చర్మకారుల దుకాణాల వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. మందమర్రిలో లెదర్ పార్కు శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈ నెల 27, 28న నాగార్జునసాగర్‌లో రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని, ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షులు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ హాజరవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మహాసభలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళ నాయకులు బత్తుల సరిత, వినోద, వనిత లక్ష్మీ, కన్నూరి క్రిష్ణ, రవి, బాబు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



పోశం (ఫైల్)

కాసిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాసిపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకు డు పుర్ర పోశం (45) గుండెపోటుతో సోమ వారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం తెల్ల వారుజామున పోశం వాకింగ్‌కు వెళ్లి వచ్చాడు. ఛాతిలో నొప్పి వస్తుందని కుప్ప కూలిపోవడంతో గమనించిన కుటుంబీకులు ప్రైవేటు వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఆర్థిక సహాయం అందజేత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంఘం సభ్యుడు అడిచెర్ల మహేష్ గత సంవత్సరం ఆగస్టులో మృతిచెందాడు. సంఘం తరుపున ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకం నుంచి వచ్చిన రూ. 1.60లక్షలు, బెల్లంపల్లి మండల యూనియన్ నుంచి జమ చేసిన రూ. 30 వేలు, మొత్తం రూ. 1.90 లక్షలు మృతుడు మహేష్ కుటుంబ సభ్యులకు సోమవారం బెల్లంపల్లిలో సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మహేష్, మండల అధ్యక్షుడు ఆకుల వేణు, సభ్యులు కనకయ్య, రామన్న, సతీష్, శంకర్‌బాబు, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, విక్రమ్, సందీప్ పాల్గొన్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత



యోగా పోటీల్లో గెలుపొందిన వారితో ఎమ్మెల్యే వినోద్, నాయకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఏకాగ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల్లో యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని సన్మానించారు. వివిధ విభాగాల్లో తెలంగాణ యోగా కప్‌లో బెల్లంపల్లికి చెందిన పలువురు రాణించి విజేతలుగా నిలవడం గొప్ప విషయమన్నారు. యోగా పోటీల్లో శిరీష, మానస, హేమలత, పద్మ, సాహిత్యలు బహుమతులు సాధించగా వీరిని ఎమ్మెల్యే వినోద్, ఆయన సతీమణి సన్మానించారు. నాయకులు రాజలింగు, రామానుజ్ సోని, యోగా సెంటర్ నిర్వాహకురాలు వెం కటరమణమ్మ, మల్లయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం


దండేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కాసిపేట శ్రీభక్తాంజనేయ ఆలయ అభివృద్ధి, పునః నిర్మాణ కమిటిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పాల సునీల్, గంగారెడ్డి, రవీందర్, గంగాధర్, మహేష్, నరేష్, ప్రభాకర్‌లను ఆలయ అభివృద్ధి కోసం గ్రామ మాజీ సర్పంచ్ షైదం గంగారెడ్డి సమక్షంలో కమిటి సభ్యులుగా నియమించుకున్నారు.

ఓటమి గెలుపునకు నాంది కావాలి

దండేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఓటమి గెలుపునకు నాంది కావాలని అప్పుడే మనం విజయం సాధిస్తామని రెబ్బన్‌పల్లి ప్రధానోపాధ్యాయుడు రాజు అన్నారు. రెబ్బన్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం మండంలోని వివిధ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు క్విజ్ పోటీలను ఏర్పాటు చేసారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రోగ్రాం ఇన్‌చార్జ్ షరీఫొద్దీన్, రూపాచారితో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

చెరువు అభివృద్ధి పనులను చేపట్టాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : అర్ధాంతరంగా నిలిచిపోయిన మంచిర్యాలలోని రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ సోమవారం వాకర్స్ అసోసియేషన్ నాయకులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీకి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 2022లో మూడున్నర కోట్ల రూపాయలతో రాముని చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులను ప్రారంభించారని, కానీ గత సంవత్సరం నుంచి అర్ధాంతరంగా పనులను నిలిపివేశారన్నారు. వెంటనే పనులను చేపట్టాలన్నారు. వాకర్స్ సభ్యులు గజెల్లి వెంకటయ్య, బూర్ల జ్ఞాని, నర్సయ్య, రాధాకృష్ణ ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల/బెజ్జూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన, బెజ్జూరు సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ రాజేశ్వర్, ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా 132 కేవీ లైన్ నిర్మాణం, 33 కేవీ బెజ్జూరు ఫీడర్, 11 కేవి చీపురుదుబ్బ ఫీడర్‌లో ఎల్‌సీ తీసుకోవడం జరుగుతుందని ఇందులో భాగంగా గురుడుపేట, కన్నెపల్లి, కస్కి, బోదంపల్లి, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొరకు నియమించబడిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 27న జరిగే పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు డైరీపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో సామగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకోవాలని, సకాలంలో రిపోర్టు చేసి పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సామగ్రి, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పరిశీలించి కేటాయించిన ప్రకారం ఉన్నవాటి వివరాలు సరిచూసుకుని తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులకు సీలు వేయాలని, సిబ్బంది కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ వెబ్ కాస్టింగ్ ఉంటుందని, విధుల్లో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని, పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సులో సీలుపై సిబ్బందికి శిక్షణ అందించారు. అనంతరం కలెక్టరేట్ పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, అదనపు ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రతిఒక్కరూ ఆర్థిక కార్యకలాపాలపై అవగహన కలిగి ఉండాలని కలెక్టర్ వేంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళ ఉద్యోగులకు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా 2016 నుంచి ప్రతి గ్రామం, పట్టణంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగహన కల్పిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 24వ తేది నుంచి 28వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళలు, గృహ బడ్జెట్, సూక్ష్మ పొదుపు, శ్రామిక మహిళలు నెలవారీ పొదుపు వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు, అనంతరం ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాలకు సంబంధించిన గోడప్రతులన అవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ద శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనెజర్ రాజేశ్వర్ జోషి డీఆర్‌డీవో దత్తారాం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు



- ఏటా వేసవికాలంలో అంతులేని నష్టం
- అగ్నికి ఆహుతవుతున్న విలువైన వృక్ష సంపద, వన్యప్రాణులు
- దెబ్బతింటున్న పర్యావరణం
- నివారణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏటా వేసవికాలం వచ్చిందంటే చాలు ఎక్కడో ఓ చోట అగ్గి రాజుకుని అడవిలోని చెట్లకు మంటలు అంటుకుంటాయి. కార్చిచ్చురేగి విలువైన వృక్షాలు, జంతువులు ఆహుతవుతుంటాయి. ఆకురాలే కాలం ప్రారంభం కాగానే పొరపాటున అగ్గిరవ్వలు పడి అంతు లేని నష్టం జరుగుతుంది. దీంతో పర్యావరణం దెబ్బతింటుంది. కార్చిచ్చుల నివారణకు అటవీశాఖ సిబ్బంది డిసెంబరు నుంచి ఫైర్‌లైన్ల నిర్వహణతో అటవీశాఖ అగ్ని నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

● అగ్గి పడకుండా అన్ని చర్యలు :

జిల్లాలో మొత్తం 11 అటవీ రేంజ్‌లు రెండు డివిజన్లు ఉన్నాయి. వీటిలో 2445.40 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉంది. ఇతర జిల్లాలతో పోలిస్తే దీనిలో ఎక్కువగా టేకు ఉండడంతో వేసవి కాలంలో అగ్గి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబరు నుంచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చడంతో పాటు అడవిలో అగ్గి కనిపిస్తే అందుబాటులో ఫోన్‌నంబర్లు కూడా ఉంచారు.

● అడ్వాన్స్ టెక్నాలజీతో..

ఫైర్‌లైన్లతో పాటు గతంతో పోలిస్తే అడ్వాన్స్ టెక్నాలజీని వాడి పర్యావరణ రక్షణ కోసం అటవీ శాఖ కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అడవిలో అగ్గి పడ్డ కూడా ఫారెస్టు వన్ అగ్ని పోర్టల్ శాటిలైట్ ద్వారా వెంటనే సంబంధిత రేంజ్ కార్యాలయంతో పాటు బీట్ అధికారి మొబైల్‌కు జీపీఎస్ పాయింట్‌తో సంక్షిప్త సందేశం వస్తుంది. దీనితో వెంటనే ఆయా బీట్, సెక్షన్, రేంజ్ అధికారులు అలర్ట్ అయి మంటలు ఆర్పుతున్నారు. దీంతో పర్యావరణానికి ఇబ్బంది కాకుండా అనునిత్యం కృషి చేస్తున్నారు.



ఫైర్ లైన్లను ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

● ముందస్తు చర్యలు..

జిల్లాలోని మొత్తం 243 బీట్‌లలో అటవీ ప్రాంతంలో అగ్గిపడకుండా అటవీ అధికారులు ముందస్తుగా ఫైర్ లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. బ్లోయర్ల సహాయంతో ఆకులు దగ్గరికి చేసి అంటిస్తారు. దీంతో రోడ్డు మీద నుంచి ఈ లైన్ దాటి లోపలికి వెళ్లే పరిస్థితులు తక్కువగా ఉంటాయి. ప్రతీ సంవత్సరం అటవీ అధికారులు చర్యలు చేపట్టి కొంత అడవి కాలి పోకుండా చూస్తున్నారు. అగ్గిపడితే వన్యప్రాణులకు నష్టం జరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు.

● గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు..

అడవిలో పడే అగ్గికి సంబందించి గ్రామా ల్లో నవంబరు, డిసెంబరు నుంచి అటవీ అధికారులు పెద్ద ఎత్తున వేసవి కాలం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పోస్టర్ల ఆవిష్కరణ, వాటిని గ్రామాల్లో అంటించడం ప్రత్యేక మొబైల్ నంబర్లు గ్రామస్థులకు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరికైనా అడవిలో అగ్గి కనిపిస్తే వెంటనే సదురు నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరుతున్నారు. అలాగే నిధులు అందుబాటులో ఉన్న చోట ఫైర్ వాచర్లను నియమిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి..

- గోవింద్‌చాంద్ సర్దార్, ఎఫ్ఆర్వో, ఆసిఫాబాద్



వేసవి కాలంలో చెట్ల నుంచి పెద్ద ఎత్తున ఆకులు రాలి ఎండిపోయి ఉండడంతో అగ్గి పడే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. దీంతో పర్యావరణ సమతుల్యం కొంత దెబ్బ తింటుంది. ఇలా జరగకుండా ప్రతీ బీట్‌లలో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి అడవిలోకి అగ్గి వెళ్లకుండా చూస్తున్నాము. పశువుల కాపర్లు లేదా పాదాచారులు బీడీలు తాగడం లాంటివి చేసినప్పుడు అగ్నిపుల్లలు ఆర్పివేయాలి. ప్రజలు సహకరించినప్పుడే అడవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా చూసే అవకాశం ఉంటుంది. ప్రత్యేక శాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు అగ్నిప్రమాదాలను గుర్తించి ఆర్పడంతో పాటు సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై ప్రతీ రోజు వారికి నిబంధనలు వివరిస్తున్నాం. సాధ్యమైనంత వరకు అడవిలో అగ్గి పడకుండా చూస్తున్నాం.

నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

వాంకిడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని వాంకిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యుగంత్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై కక్ష సాధింపు'

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై ఆసిఫాబాద్ డీఎం కక్ష సాధిస్తున్నారని ఆర్టీసీ ఈయూ డిపో కార్యదర్శి దివాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా తప్పుడు బ్రీత్ ఎనలైజర్‌తో కార్మికులు ఆల్కహాల్ తాగకుండా తాగినట్లు చూపిస్తుందని దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సోమవారం డ్రైవర్లు ఆల్కాహాల్ తాగకున్నా 30 శాతం తాగినట్లు చూపించిందని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం డీఎంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు

జైనూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివనూర్, జంగాం, రాసిమెట్ట, పాట్నాపూర్ తదితర శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. భక్తులు శివాలయ మందిరాలను రంగురంగుల కాగితాలతో అలంకరిస్తూ సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. పాట్నాపూర్‌లో మహా శివరాత్రి వేడుకలు రెండురోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సుమారు పదివేల మంది భక్తులు శివరాత్రి వేడుకలకు హాజరవుతారని సిద్దేశ్వర్ ట్రస్ట్ అంచనా వేస్తోంది. ఆదేవిధంగా భక్తులకు అన్నివిధాలుగా సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పులాజీబాబ సమాధి మందిరంలో వేలాది మంది భక్తులు ధ్యాన సాధన చేస్తారు. ఇందు కోసం భక్తుల రద్దీ పెరిగే ఆవకాశం ఉన్నందున బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



కౌటాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కౌటాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మయూరి విద్యాలయం, భారతి విద్య మందిర్, శ్యామ్‌మోడల్ స్కూల్ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలు బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో ప్రజా గొంతుకగా మీ పక్షాన నిలబడి ప్రభుత్వంతో కొట్లాడి మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. దేశం కోసం ధర్మం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఎనలేని కృషి చేస్తున్నారని ప్రజల కోసం కొట్లాడేది భారతీయ జనతా పార్టీ ఒక్కటేనని అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, విజయ్, మోతిరాం, భీమన్న, బండురావు, తిరుపతి, మధుకర్, చందు, భూమన్న, శ్రీను, గోమాజి, వెంకటేష్, తిరుపతి, సాయి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా..

సిర్పూర్(టి), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోసపూరిత కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థుల తరపున ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. పట్టభద్రులు మేల్కోని బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిస్థితి ఏడు రోజుల నుంచి ఆగమ్యగోచరంగా మారిందని ఆయనను కాంగ్రెస్ పొమ్మంటుందని, బీఆర్ఎస్ వద్దంటుందని ఈ పరిస్థితిని చూసి బీజేపీ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. వారి అనుభవానికి, వయస్సుకు సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ఇప్పటి నుంచే తమ పార్టీలోకి వచ్చి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు సీసీఐ పత్తి కొనుగోళ్లు గత సంవత్సరం 10 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేస్తే నరేంద్ర మోదీ ప్రభుత్వం 20 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి సిర్పూర్ నియోజకవర్గ రైతుల అకౌంట్లలో రూ.1500 కోట్లు జమ చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకు డు నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ రేఖసత్యనారాయణ, నాయకులు లావణ్య, సత్యనారాయణ, కిశోర్, అశోక్, సాయి, ఎన్.అశోక్, విలాస్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల సీఎస్, డీవో, రూట్ అధికారుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 6421 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్స్ ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్థవంతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అదికారి ఉదయ్‌బాబు, సీఎస్‌లు, డీవోలు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

సిర్పూర్ (టి), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా జరిగేలా కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది కృషి చేయాలని సిర్పూర్(టి) న్యాయమూర్తి అజయ్ అల్లోల అన్నారు. సోమవారం సిర్పూర్ (టి) కోర్టు హాలులో సబ్ డివిజన్‌లోని డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ శాతం రాజీమార్గంలో కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. డీఎస్పీ రామానుజం, సీఐ రమేష్, ఎస్సైలు కమలాకర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కాగజ్‌నగర్ మండలం ఈసుగాం, వాంకిడి, నంబాల, బుగ్గ శివాలయాల ప్రాంగణంలో జరిగే ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపస్తున్నట్లు డీఎం విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి వాంకిడికి మూడు బస్సులు, కాగజ్‌నగర్ నుంచి ఈసుగాంకు ఆరు బస్సులు, బెల్లంపల్లి నుంచి బుగ్గకు 15 బస్సులు, ఆసిఫాబాద్ నుంచి నంబాలకు నాలుగు బస్సులు మొత్తం 28 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి వాంకిడికి పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20, బెల్లంపల్లి నుంచి బుగ్గకు పెద్దలకు రూ. 40, పిల్లలకు రూ. 20, ఆసిఫాబాద్ నుంచి నంబాలకు పెద్దలకు రూ. 70, పిల్లలకు రూ. 40, కాగజ్‌నగర్ నుంచి ఈసుగాంకు పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 20 చార్జీలు ఉంటాయన్నారు. జాతరకు వెళ్లే ప్రతి బస్సుల్లోనూ మహాలక్ష్మి స్కీం వర్తిస్తుందని తెలిపారు.

ఘనంగా ఎక్కాహం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని సాయిబాబా ఆలయంలో చప్రాల ఆధ్యాత్మిక కేంద్రం సద్గురు శ్రీ కార్తీక్ స్వామి మహారాజ్ పుణ్యతిథిని పురస్కరించుకుని ఎక్కాహం భజన కార్యక్రమం, గోపాలకాల కార్యక్రమం నిర్వహించారు. అనంత రం మండల కేంద్రంలో పలు వీధుల గుండా పల్లకీ సేవ నిర్వహిం చారు. కార్యక్రమంలో సిర్పూర్(టి), పోడ్సా, సాండ్‌గాం, కౌటాల, గుండాయిపేట తదితర మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ గ్రామంలో స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేదపండితులు నిమ్మకంటి సంతోష్‌శర్మ, మహేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమంతో నూతన శివలింగం, నంది విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా జర్నలిస్టులు సమస్యలు ఎదుర్కొంటున్నా వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పరిష్కరించడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు మహేష్, రాజశేఖర్, సురేందర్‌రావు, సంతోష్, నాగేందర్, విష్ణుగౌడ్, కిరణ్, రవి, శ్రీధర్, చేతన్, సాయి పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

- సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తనపై తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలని, భవిష్యత్తులో పునరావృతమైతే ఊరుకునేది లేదని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హెచ్చరించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇక్కడే పుట్టి పెరిగానని, ఈ ప్రాంత ప్రజలు గుండెల్లో పెట్టుకొని తనను మూడుసార్లు గెలిపించారని తెలిపారు. తనను వలసవాది అంటూ అనటం సరికాదన్నారు. వాస్తవంగా బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వలస వాది అని ఎద్దేవా చేశారు. పుట్టింది ఆలంపూర్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసింది సిర్పూరులో, మళ్లీ నాగర్‌కర్నూల్‌లో ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. అయినా సిగ్గులేకుండా మళ్లీ సిర్పూరులో టూరిస్టు వ్యక్తిగా వచ్చి పోతున్నట్టు తెలిపారు. తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఇక ఊరుకునేది లేదన్నారు. తగిన విధంగా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ప్రవీణ్‌కుమార్ ఆగడాలకు సంబంధించిన 380 వీడియోలున్నాయని, త్వరలోనే ఒక్కొక్కటి విడుదల చేస్తానిని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలపై ప్రభుత్వానికి పట్టింపు లేదు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ధర్నా చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం కాగజ్‌నగర్ ఈసుగాం ఆలయ సమీపంలోని బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగ మార్గంలో పైకప్పు కూలి ప్రమాదంలో ఎనిమిది గల్లంతైతే సీఎం ఎన్నికల ప్రచారంలో పాల్గొనటం విడ్డూరంగా ఉందన్నారు. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ నుంచి ఇతర మండలాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఇరుకైన వంతెన వెడల్పు చేయాలని డిమాండు చేశారు. ఇరుకైన వంతెన వల్ల ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నా అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకోవటం లేదన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ కూడా ప్రొసీడింగ్‌లు తెస్తున్నా పనులు మాత్రం చేయటం లేదన్నారు. కేవలం నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయలు వెచ్చిస్తే బ్రిడ్జిల వెడల్పులు చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వెంటనే స్పందించి వంతెనలను వెడల్పు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.